సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 31 । జనవరి । 2023



శ్రీ చక్ర శుభ నివాసా...
దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పదవ రోజు సోమవారం చక్రస్నాన కార్యక్రమం వైభవంగా జరిగింది. - 8లో



గండికోటలో రెండో రోజు షూటింగ్‌లో కమల హాసన్
జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో భారతీయుడు-2 షూటింగ్‌లో హీరో కమలహాసన్ పాల్గొన్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
31.2 /19.8

వాతావరణం
జిల్లాలో సోమవారం 19.8 - 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

విపత్తుల్లో ప్రజలకు అండగా నిలవాలి
– డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాల్లో ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ఆపద మిత్రలు ప్రజలకు అండగా నిలబడాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి చెప్పారు. ఈనెల 19 నుంచి జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనంలో ఆపద మిత్రలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు సమావేశానికి హాజరైన డీపీఓ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెలకువలను ఆయా మండలాల ఆపదమిత్రలు మరికొందరికి నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ వెంకటేశ్, ఏఓ ప్రభాకర్, ఫ్యాకల్టీ సురేష్‌కుమార్, ట్రైనర్ నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్ : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర ఎన్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లను సంప్రదించాలన్నారు.

3న జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డీఆర్‌డీపీ, సీ డ్యాప్ సంయుక్తాధ్వర్యంలో ఫిబ్రవరి 3న కడప నగరంలోని ఐటీఐ కళాశాలలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. 16 కంపెనీలు ఈ జాబ్ మేళాలలో పాల్గొంటాయన్నారు. వివరాలకు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ లో రిజిస్టర్ చేసుకోవాలని ఆమె కోరారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

డీఆర్‌సీ సమావేశంలో డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు

కడప సిటీ : అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లు సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు పి. రవీంద్రనాథ రెడ్డి, ఎస్. రఘురామిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా లు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, పురపాలక పట్టణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల ద్వారా మంజూరు చేసిన మొత్తం 1217 పనులకుగాను 122 పనులు పూర్తయ్యాయన్నారు. వ్యవసాయ రంగానికి ఈ ఆర్థిక సంవత్సరానికి 3,99,968 ఎకరాల సాధారణ సాగుబడికి 2,54,572 ఎకరాల్లో పంట సాగు జరిగిందన్నారు. 92.67 శాతం ఈ–క్రాప్ బుక్‌చేసి రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నామన్నారు. ఈకేవైసీ 48 శాతం చేశామన్నారు. రబీ సీజన్‌లో 1.50 లక్షల హెక్టార్ల సాధారణ సాగుకు గాను 1.03 లక్షల హెక్టార్లలో పంటల సాగు జరిగిందన్నారు. 31,478 క్వింటాళ్ల శనగ, 4.84 క్వింటాళ్ల మినుము, 1800 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేశామని తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలోని 432 ఆర్బీకేల్లో రబీ సీజన్‌లో 12646.851 మెట్రిక్ టన్నుల నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉంచి 11565.445 మెట్రిక్ టన్నులను పంపిణీ చేశామన్నారు. రైతు భరోసా కింద నాల్గవ ఏడాది మొదటి విడతలో 1,98,074 మంది రైతులకు రూ. 192.96 కోట్లు పంపిణీ చేశామన్నారు. పంటల బీమా 2021కి సంబంధించి 90,553 మంది రైతులకుగాను రూ. 285.71 కోట్లను క్లెయిమ్ చేశామన్నారు. జిల్లాలో 2022 రబీ సీజన్‌లో ఉద్యాన పంటల సాధారణ సాగు విస్తీర్ణం 10,963 కాగా 4,773 హెక్టార్లలో ఉద్యాన సాగు జరిగిందన్నారు. సూక్ష్మసాగునీటి విధానం ద్వారా రైతులకు సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేస్తామన్నారు. ఈ ఆర్థిక ప్రణాళికలో 16,817 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 5640 మందికి సంబంధించి పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. విద్యా వ్యవస్థలో నాడు–నేడు ద్వారా జిల్లాలో రెండవ దశలో 2,047 పాఠశాలల్లో 10 రకాలైన మెరుగైన వసతులు కల్పిస్తూ మొత్తం 911 పాఠశాలల రూపురేఖలు మారనున్నాయన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 1,87,742 మంది తల్లుల ఖాతాల్లో రూ. 244.06 కోట్లను జమ చేశామని పేర్కొన్నారు. జగనన్న విద్యాకానుక కింద 1,59,410 మందికి కిట్లు అందజేశామని, అందుకుగాను రూ. 31.88 కోట్లు ఖర్చుచేశామని చెప్పారు. అలాగే పలు పథకాల ద్వారా ప్రభుత్వం కల్పించిన ఆర్థిక భరోసా వివరాలు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి
– జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్

వైఎస్సార్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ మూడేళ్లలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా ముఖ్యమంత్రి ఆలోచనా విధానాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనన్నారు. సమాజంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రగతి చక్రల్లాంటివారన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలన్నారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ
– డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. సీఎం ఆలోచన, ప్రభుత్వ ఉద్దేశాలను అర్థం చేసుకుని క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యల పట్ల అవగాహన కలిగి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో అన్ని జలాశయాలు పూర్తి స్థాయి నీటిమట్టంతో కళకళలాడుతున్నాయంటే అది మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి, పట్టుదల ఫలితమేనన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా..
– కలెక్టర్ విజయరామరాజు

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు అన్నారు. జిల్లాలో అన్ని రిజర్వాయర్లు కలిపి 84.489 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 69.691 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. సాగు, తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అనంతరం జిల్లాలో సాధించిన ప్రగతిని కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన
– కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జేసీ సాయికాంత్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ నిర్మాణాల పురోగతిపై నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, సేవలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగనన్న కాలనీల్లో పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశుతోపాటు తహసీల్దార్లు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జేసి సాయికాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆడా వీసీ శ్రీలక్ష్మి లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఫిబ్రవరి 2న డిప్లమా ఇన్ ఫార్మసీ స్పాట్ అడ్మిషన్స్

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ) అర్హతగల విద్యార్థులు డిప్లమా ఇన్ ఫార్మసీ(డి. ఫార్మసీ)లో అడ్మిషన్స్ కోసం ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 10 గంటలకు కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9640637907, 9985391616 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జగనన్న చేదోడు వృత్తి వ్యాపారులకు బాసట

- డీఆర్వో గంగాధర్ గౌడ్
- వినుకొండ బహిరంగ సభ నుంచి జగనన్న చేదోడు లబ్ధి మొత్తాన్ని విడుదల చేసిన ముఖ్యమంత్రి
- జిల్లాలో 16,577 మంది లబ్ధిదారులకు రూ. 16.57 కోట్లు విడుదల



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు

కడప సిటీ : వృత్తి వ్యాపారుల ఆర్థిక వృద్ధే జగనన్న చేదోడు పథక లక్ష్యమని డీఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. షాపులున్న రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ, వృత్తి వ్యాపారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా వినుకొండ బహిరంగ సభ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి మూడవ విడత 'జగనన్న చేదోడు' లబ్ధి మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు.

ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి డీఆర్వో గంగాధర్ గౌడ్, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ జి. రమణమ్మ, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ జి. నాగలక్ష్మి, ఆరె కటిక కార్పొరేషన్ డైరెక్టర్ పి. ఉమా మహేశ్వరి, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ మురళీధర్, తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవీంద్ర, బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య లు హాజరయ్యారు.

మెగా చెక్కు అందజేత

వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం అక్కడికి వచ్చిన అతిథులతో కలిసి డీఆర్వో గంగాధర్ గౌడ్ జగనన్న చేదోడు పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా షాపులున్న 16,557 మంది నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ల కుటుంబాలకు మూడవ విడతగా మంజూరైన రూ. 16,57,70,000 మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి చివరి వ్యక్తికి కూడా జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధి చేకూరాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో కూడా ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుందన్నారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించి అర్హులకు జగనన్న చేదోడు లబ్ధి చేకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు లేవు



ముఖ్యమంత్రి జగనన్న వృత్తి వ్యాపారులకు ఆర్థికసాయం అందిస్తూ దేవుడిలా ఆదుకుంటున్నారు. లాండ్రీ షాపు పెట్టి ఇస్త్రీ చేసుకుంటూ వచ్చిన సొమ్ముతో ఇల్లు గడుస్తోంది. ప్రభుత్వం నుంచి పలు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.
– ఎ.లక్ష్మి, లాండ్రిషాపు, సుబ్బన్నగారిపల్లె, కడప

సీఎం అండ మాకు ఉంది



అడగకుండానే ప్రజల అవసరాలు గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్థికసాయం అందిస్తూ అండగా నిలబడుతున్నారు. ఇంటి వద్దే షాపు పెట్టి టైలరింగ్ చేస్తున్నాను. ప్రభుత్వం అందిస్తున్న చేదోడు సాయంతోపాటు ఒంటరి మహిళ పెన్షన్ కూడా అందుతోంది. ఇలాంటి ముఖ్యమంత్రిని ఇది వరకు ఎప్పుడూ చూడలేదు.
– భవాని, టైలర్, నబీకోట, కడప

చేదోడు మా పాలిట వరం



జగనన్న చేదోడు పథకం మా పాలిట వరంగా మారింది. కరోనా కష్టకాలంలో పనులు లేక ఇబ్బందులు పడ్డాం. అలాంటి సమయంలో ఈ పథకం మమ్మల్ని ఆదుకుంది. వృత్తి పరంగా సెలూన్ షాపు నిర్వహిస్తున్నాను. ఈ మొత్తాన్ని కొత్త సామాను కొనుగోలుకు ఉపయోగించుకుంటున్నాను.
– కె.నాగార్జున, సెలూన్ యజమాని, విశ్వనాథపురం,కడప

ఆత్మవిశ్వాసం పెరిగింది



జగనన్న చేదోడుతో ఆత్మవిశ్వాసం పెరిగింది. లాండ్రీ ద్వారా జీవనం సాగిస్తున్నాను. గతంలో వడ్డీలకు డబ్బులు తెచ్చుకునేవారం. చేదోడు ఆర్థికసాయంతో ఆ అవసరం లేకుండా పోయింది. మా అమ్మా నాన్నలకు పెన్షన్ వస్తోంది. పిల్లలకు అమ్మఒడితోపాటు ఇంటి పట్టా కూడా వచ్చింది.
– సురేంద్ర, రజకుడు, అరవిందనగర్, కడప

నేటి నుంచి ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్

ఔత్సాహిక యువ క్రీడాకారులకు సువర్ణావకాశాలు కల్పించాలన్న సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) నాలుగో సీజన్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈ పోటీలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- నేడు ప్రారంభ వేడుకలు
- జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

కడప స్పోర్ట్స్ : సాక్షి ప్రీమియర్ లీగ్–2023 క్రికెట్ టోర్నమెంట్ జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సీనియర్ విభాగం, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, 11 గంటలకు , మధ్యాహ్నం 2 గంటలకు చొప్పున రెండు మైదానాల్లో సమాంతరంగా మ్యాచ్‌లు జరగనున్నాయి. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మ్యాచ్‌లు 10 ఓవర్ల చొప్పున నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. క్రికెట్ నిబంధనలు అనుసరించి పోటీలు నిర్వహిస్తారు. మ్యాచ్ నిర్వహించే సమయంలో క్రీడాకారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్‌గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్‌డ్రస్, వైట్ షూస్‌లతో హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సంబంధిత కళాశాల ఐడెంటిటీ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి సర్టిఫికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

కేఎస్ఆర్ఎం మైదానంలో..

ఉదయం 9 గంటలకు : ప్రభుత్వ పాలిటెక్నిక్, వేంపల్లి– ప్రభుత్వ పాలిటెక్నిక్–1, ప్రొద్దుటూరు. (జూనియర్ విభాగం)

ఉదయం 11 గంటలకు : కేఓఆర్ఎం, కడప –ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు

మధ్యాహ్నం 2 గంటలకు : నిర్మల ఫార్మసి కళాశాల, కడప –జేఎన్‌టీయూ, పులివెందుల

కేఓఆర్ఎం మైదానంలో..

ఉదయం 9 గంటలకు : ప్రభుత్వ పాలిటెక్నిక్–2, ప్రొద్దుటూరు – ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ

ఉదయం 11 గంటలకు : డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ, కడప– సీబీఐటీ, ప్రొద్దుటూరు

జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపుదాం

- మార్క్‌ఫెడ్ ద్వారా మినుము, శనగ కొనుగోలు
- పశువుల బీమా మంజూరుకు చర్యలు
- రూ. 27 కోట్లతో సీపీడబ్ల్యు ఎస్ స్కీమ్స్
- వ్యవసాయానికి 'ఉపాధి'తో అనుసంధానం
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సొంత జిల్లా కనుక అన్ని రంగాలలో ఆదర్శంగా నిలపాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతిపథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. సోమవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. మినుములు, బుడ్డశనగల కొనుగోలులో దళారుల పాత్ర నిరోధించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే జిల్లాలో 26 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారని వెల్లడించారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత అధిక శాతం మంది పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మృతి చెందిన పాడి ఆవులు, గేదెలతోపాటు గొర్రెలకు బీమా సకాలంలో అందేవిధంగా అధికారుల ద్వారా చర్యలు చేపడతామన్నారు. 2023–24 సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా సీపీడబ్ల్యుఎస్ పనులను గుత్తేదారులకు అప్పగిస్తున్నామని తెలిపారు. రాజంపేట డివిజన్‌లో రూ. 8.35 కోట్లతో తొమ్మిది పనులు, పులివెందుల డివిజన్‌లో రూ. 11 కోట్లతో ఏడు పనులు, కడప డివిజన్‌లో రూ. 7.51 కోట్లతో ఆరు పనులు వెరసి రూ. 27,01,95,000తో 22 పనులు చేపడుతున్నామని వివరించారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలంటూ కేంద్రానికి ప్రతిపాదన పంపాలని సమావేశంలో తీర్మానిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపు : జిల్లా ఇన్‌చార్జిమంత్రి

సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, బల్క్‌మిల్క్ చిల్లింగ్ సెంటర్ల భవన నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలో చెల్లిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ హామీ ఇచ్చారు. తాగునీటి రవాణాకు సంబంధించిన బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నది గనుక పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను బడ్జెట్ సమావేశాలు ప్రారంభంలోపే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్ పశు బీమా పథకం కోసం ప్రభుత్వం ఒక నిధిని కూడా ఏర్పాటు చేసిందన్నారు. పశు బీమా కింద 15 రోజుల్లో పరిహారం ఇస్తామన్నారు. సచివాలయాల్లో, స్పందన కార్యక్రమంలో, ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులను గౌరవించాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు.

ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం ఆగదు : ఉప ముఖ్యమంత్రి

రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాల అమలును కొనసాగిస్తారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. బడ్జెట్ సమావేశాలకు ముందే ఎన్‌ఆర్ఈజీఎస్ బిల్లులు చెల్లిస్తామన్నారు. మిగతా జిల్లాలతో పోలిస్తే కడపలోనే బిల్లుల చెల్లింపు మిన్నగా ఉందని పేర్కొన్నారు.

సభ దృష్టికి సమస్యలు..

సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమ మండలాల పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ పసుపు పంట వచ్చిన వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. తమ మండలంలో పత్తి పంట సాగు చేసి తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి కోరారు. దళారుల దోపిడీని అరికట్టేందుకు మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి కోరారు. ప్యాక్‌హౌస్ యూనిట్ కాస్ట్ పెంచాలని, సబ్సిడీ కేవలం రూ. 2 లక్షలు ఇవ్వడం అన్యాయమని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్ల నీటి లీకేజీల కారణంగా నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోవాలని వీఎన్ పల్లె ఎంపీపీ కోరారు. బద్వేలు నియోజకవర్గంలో మూడేళ్లుగా రైతులకు డ్రిప్ పరికరాలు అందడం లేదని కాశినాయన జెడ్పీటీసీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడుతున్నా ఆస్పత్రుల్లో మందులు లేవని చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. పాడి ఆవులు చనిపోతే రెండేళ్లయినా బీమా అందలేదని, కొత్త ఆవులను కొనుగోలు చేసేందుకు రైతులకు ఇబ్బందిగా ఉందని చక్రాయపేట జెడ్పీటీసీ అన్నారు. రెండేళ్లుగా గొర్రెలకు బీమా అందడం లేదని వేంపల్లె జెడ్పీటీసీ తెలిపారు. పోరుమామిళ్ల ఆస్పత్రిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తో ఇన్‌స్పెక్షన్ చేయించాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. పీఆర్‌అండ్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సమావేశంలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయరామరాజు, గిరీషా పీఎస్, వైఎస్సార్ జిల్లా జేసీ సాయికాంత్‌వర్మ, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోర్టుకు హాజరైన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యేలు

గుంతకల్లుటౌన్ : కమలాపురం రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో ఘటనలో ఆర్పీఎఫ్ పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ నిమిత్తం సోమవారం ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మేరీ, ప్రసాద్‌రెడ్డి సోమవారం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరయ్యారు. కోవిడ్ కంటే ముందు కమలాపురం రైల్వేస్టేషన్ మీదుగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను యథావిధిగా నడపాలని కోరుతూ గతేడాది జనవరిలో రైల్‌రోకో నిర్వహించారు. అప్పట్లో ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు వీరు హాజరైనట్లు న్యాయవాది సి.గోపాలకృష్ణ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

కడప అర్బన్ : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతులు అదృశ్యమయ్యారు. కడప నగరంలోని నాగరాజుపేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పరీక్షల కోసం చదువుకుంటున్న లింగాల మండలం ఇప్పట్లకు చెందిన కుమారి (19) అదృశ్యమైంది. ఈ నెల 29 నుంచి కనిపించడం లేదని అదే గ్రామానికి చెందిన ఆమె మేనమామ అగ్రహారం యుగంధర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు.

పెదనాన్న ఇంటికి వచ్చి..


సంధ్య(ఫైల్)

ముద్దనూరు : మండలంలోని చౌటిపల్లె గ్రామం నుంచి చిన్నగారి సంధ్య (21) అనే యువతి అదృశ్యమైంది. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ ఆంజనేయులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన సంధ్య 15 రోజుల క్రితం చౌటిపల్లెలోని తన పెద్దనాన్న చంద్రశేఖర్ ఇంటికి వచ్చింది. ఈ నెల 22న రాత్రి 9 గంటల సమయంలో కడుపు నొప్పికి టాబ్లెట్స్ తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆ విషయాన్ని ఆమె తండ్రికి చెప్పి బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారణ చేశారు. అయితే సంధ్య ఆచూకీ వివరాలు తెలియకపోవడంతో ఆమె తండ్రి సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి -కలమల్ల గ్రామాల రైల్వేలైన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు సోమవారం తెలియజేశారు. అతని వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని వారు పేర్కొన్నారు. ముఖం నుజ్జునుజ్జు అయినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని వివరించారు.

శ్రీ చక్ర శుభ నివాసా..

వైభవంగా చక్రస్నానం


స్వామి, అమ్మవార్లు, చక్రత్తాళ్వార్‌కు చందనాభిషేకం


చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు


హంస వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదవ రోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం, సుదర్శన చక్ర తాళ్వార్‌కు తీర్థస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మేళతాళాలతో ప్రత్యేక పల్లకీలో స్వామి, అమ్మవార్లతోపాటు శ్రీ చక్రాన్ని ఊరేగింపుగా పుష్కరిణి మండపానికి చేర్చారు. అక్కడ రెండున్నర గంటలపాటు వేద మంత్ర యుక్తంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతంతోపాటు ఇతర ద్రవ్యాలతో కూడా అభిషేకించారు.

ధ్వజావరోహణం

ఆలయ ప్రాంగణం నుంచి శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణి వద్ద గల మంటపానికి చేర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత చందన లేపనం, నారికేళ జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణమూర్తి తదితరులు పాలు, పెరుగు, తేనె, శుద్ధ జలాలతో అభిషేకం చేశారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాల మాలలతో ప్రత్యేకంగా కూర్చిన దండలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను చక్ర తాళ్వార్‌తోపాటు పుష్కరిణిలోకి తీసుకెళ్లారు. గోవిందనామ స్మరణలు, భక్తుల కోలాహలం మధ్య మూలమూర్తులతో సహా అర్చకులు పుష్కరిణిలో మూడు మునకలు వేశారు. భక్తులు తాము కూడా పుష్కరిణిలో మునకలు వేసి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. హాజరైన భక్తులకు స్వామి ప్రత్యేక ప్రసాదంగా ఉత్సవమూర్తులకు లేపనం చేసిన సుగంధం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత రాత్రి వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణంలో గరుడ పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. రాత్రి హంస వాహనంపై స్వామిని వీణాపాణిగా అలంకరించి కొలువుదీర్చారు. ఊరేగింపుగా పల్లకీలో తిరుమాడ వీధుల్లో అమ్మవారు భక్తులను కరుణించాడు.

నేడు పుష్పయాగం

బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 నుంచి 7 గంటల్లోపు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించనున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల్లోపుగా ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు తెచ్చే పూలను కూడా పుష్పయాగంలో ఉపయోగించనున్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వారి సమస్యలు సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఫుట్‌బాల్ విజేతలకు బహుమతులు ప్రదానం


విజేతగా నిలిచిన కడప జట్టుకు మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ క్రీడా పోటీలలో విజేతలకు సోమవారం మెమెంటోలు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తిరుపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్‌లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో బాలుర, బాలికల విభాగాలలో కడప జట్టు విజేతగా నిలిచిందన్నారు. రాష్ట్ర స్థాయి బాలికల జట్టులో సులోచన, నాగమ్మ, హాసిని, రోహిణి (వైజాగ్), వినీల, రేష్మ, అరుణ, భార్గవి, రామలక్ష్మి,(కడప), అనూష, మధు, కీర్తన (అనంతపురం), బెహనో, మీనా (చిత్తూరు), భావాని (వెస్ట్ గోదావరి), దేవి (ఈస్ట్ గోదావరి), దివ్య (గుంటూరు), సుహర్ష (కృష్ణా)లు ఎంపికైనారన్నారు.

ఫుట్ బాల్ బాలుర జట్టులో కిషోర్, జనార్దన్, రాజేష్, గౌతమ్ , చైతన్య (కడప), భరత్ సాయి, నిఖిల్, కుమార్ (వైజాగ్), సిద్దార్థ , దీక్షిత్ (విజయనగరం), ఈశ్వర్, రుషివర్దన్, ఆసిఫ్ (కర్నూల్), రిషితేజ్, నందకుమార్ (అనంతపురం), మణిబాబు (ఈస్ట్ గోదావరి), ప్రదీప్ (గుంటూరు), అరవింద్ (ప్రకాశం) క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐ మంజునాథ్‌రెడ్డి, దాతలు పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ ప్రసాద్‌రెడ్డిలు క్రీడాకారులకు మెమోండోలు అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లె గ్రామానికి చెందిన పోతుబోయిన మణికంఠ (20) సోమవారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంఎల్‌టీ చదువుతున్న మణికంఠ తన ఇంటికి చేరుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అయితే మణికంఠ మృతికి గల కారణాలు కేసు దర్యాప్తులో తేలుతాయని ఎస్‌ఐ తెలియజేశారు.

హ్యాండ్ బ్యాగ్‌ను కోసి చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని రద్దీగా వున్న వైవీ స్ట్రీట్‌లో సోమవారం తమ పిల్లలకు దుస్తులను కొనేందుకు వచ్చిన మల్లేశ్వరి బ్యాగ్‌ను దొంగలు కోసి అందులోని బంగారు ఆభరణాలు, నగదును కాజేశారు. వివరాల్లోకి వెళితే ... చైన్నైలో తన భర్త, పిల్లలతో వుంటున్న పెండ్లిమర్రి మండలం మర్రిమాకులపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి కుమార్తె మల్లేశ్వరి తన పుట్టింటికి వచ్చేందుకు చెన్నై నుంచి రైలులో బయలుదేరి సోమవారం కడప రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే రైల్వేస్టేషన్‌కు తన తండ్రి మల్లికార్జునరెడ్డిని పిలిపించింది. తరువాత అక్కడి నుంచి వైవీ స్ట్రీట్‌లోకి పిల్లలకు బట్టలు కొనేందుకు వెళ్లారు. ఆ సమయంలో తనతోపాటు వెంట పెట్టుకున్న చిన్నబ్యాగ్‌లో బంగారు ఆభరణాలు 12 తులాలు, రూ.7 వేలు నగదు వున్నాయి. బట్టలు కొని వస్తుండగా తన బంగారు, నగదు దాచిన బ్యాగ్‌లో నుంచి ఇతర వస్తుసామగ్రి కింద పడుతుండగా గమనించింది. అప్పటికే ఆమె బ్యాగును దొంగలు నిలువునా కత్తిరించారు. అందులోని బంగారు ఆభరణాలతోపాటు నగదును దోచుకుని వెళ్లారు. దీంతో ఆమె బోరున విలపించింది. ట్రాఫిక్ పోలీసుల సమాచారంతో కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

8 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


క్రీడాకారులకు అభినందన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎస్.బాషామొహిద్దీన్

కడప స్పోర్ట్స్ : వైఎస్ఆర్ జిల్లా యర్రగుంట్లలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన 66వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ బాలబాలికల పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడంలో కడప వైఎస్ఆర్ క్రీడా పాఠశాల విద్యార్థులు కీలకంగా వ్యవహరించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఆరుగురు, బాలికల విభాగంలో 8 మంది బాలికలు జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించి జిల్లా జట్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. వీరిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన నలుగురు బాలుర, నలుగురు బాలికలను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామొహిద్దీన్ అభినందించారు. ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన ఫుట్‌బాల్ శిక్షకుడు ఎం.హరిని అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..

సి.రాజేష్, పి.చైతన్యరెడ్డి, బి.జనార్ధన్, డి.కిశోర్‌కుమార్, టి.అరుణ, కె.వెన్నెల, ఎస్.రేష్మ, పి.రామలక్ష్మి.

గండికోటలో రెండో రోజు షూటింగ్‌లో కమల హాసన్


హెలికాప్టర్ దిగి షూటింగ్‌లో పాల్గొనేందుకు వస్తున్న కమలహాసన్

జమ్మలమడుగు : జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో భారతీయుడు-2 షూటింగ్‌లో హీరో కమలహాసన్ పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో గండికోట షూటింగ్ స్పాట్‌కు చేరుకున్నారు. అనంతరం నేరుగా డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించే భారతీయుడు-2 సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. కమలహాసన్‌ను చూసేందుకు అభిమానులతోపాటు, పర్యాటకులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. అయితే ఎవరికీ లోనికి అనుమతి లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు సినిమా షూటింగ్ స్పాట్ నుంచి హెలికాప్టర్‌లో వెళ్లిపోయారు. తిరిగి మంగళవారం సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

గ్యాస్ నిక్షేపాల కోసం మరో మారు సర్వే

వెల్లాలలో క్యాంప్ ఏర్పాటుకు సన్నాహాలు

రాజుపాళెం : మండల పరిసర ప్రాంతాల్లో గ్యాస్ నిక్షేపాల కోసం మరో మారు ఓఎన్‌జీసీ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో పూర్తి స్థాయిలో సర్వే చేయిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి వెల్లాల పుణ్య క్షేత్రంలోని సీతారామ కల్యాణ మండపంలో నిర్వాహకునితో ఓఎన్‌జీసీ అధికారులు క్యాంప్ ఏర్పాటుకు సంప్రదించినట్లు సమాచారం. వైఎస్సార్ జిల్లాలోని రాజుపాళెం, దువ్వూరు, పెద్దముడియం మండల పరిసర ప్రాంతాలతోపాటు నంద్యాల జిల్లాలోని కొన్ని గ్రామాల్లో గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు మూడేళ్ల క్రితం హెలికాప్టర్ ద్వారా కిందికి ఓ యంత్రాన్ని జారవిడిచి సర్వే చేశారు. అప్పట్లో ఈ సర్వేపై గ్రామాల్లో పెద్దగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం గ్యాస్ నిక్షేపాల కోసం సన్నాహాలు చేయడం, కొన్ని గ్రామాల్లో బోర్లు వేసి గ్యాస్ నిక్షేపాల కోసం వెతికారు. ప్రస్తుతం తిరిగి ఓఎన్‌జీసీ అధికారులు ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు గ్యాస్ నిక్షేపాలపై సమగ్ర సర్వే చేయనున్నారు. మ్యాప్ ద్వారా గ్యాస్ నిక్షేపాలు ఉన్న ప్రాంతాలను గుర్తించారు. పూర్తిగా అధ్యాయనం చేసిన తర్వాత ఇక్కడ నిక్షేపాలు లభ్యమైతే ఈ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బైక్ అదుపు తప్పి.. ఇద్దరికి గాయాలు

గోపవరం : మండల పరిధి గరుడయ్య సత్రం సమీపంలోని నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై సోమవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రొద్దుటూరు ఆదర్శకాలనీకి చెందిన పెంచలయ్య, నరసింహులు అనే ఇద్దరు యువకులు నెల్లూరుకు వెళుతుండగా బైకు అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న బి.కోడూరు 108 సిబ్బంది గాయపడిన వీరిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. బద్వేలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వారిది రాజకీయ వ్యభిచారం

- జనసేనకు ఒక్కసీటు కూడా రాదు
- వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆదిమూలపు సురేష్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సిటీ : టీడీపీ, జనసేన పార్టీలది రాజకీయ వ్యభిచారమని వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కడప కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా సమావేశం (డీఆర్సీ) అనంతరం ఆయన డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు తనయుడు లోకేష్ పాదయాత్రపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నారా లోకేష్ ఎమ్మెల్యే కూడా కాదన్నారు. ప్రజాప్రతినిధి అసలే కాదన్నారు. కబ్జా చేసి టీడీపీని చంద్రబాబు లాక్కున్నారన్నారు. ఆ పార్టీలో గెలువలేక దొడ్డిదారిన లోకేష్ మంత్రి అయ్యాడన్నారు. 2019 నాటి పరిస్థితే భవిష్యత్తులో టీడీపీకి పునరావృతమవుతుందన్నారు. జనసేనకు ఒక్క సీటు కూడా రాదని ధ్వజమెత్తారు. వారిది అపవిత్ర కలయిగా అభివర్ణించారు. చంద్రబాబు సభలకు జనం రాకపోవడంతో సందుల్లో, గొందుల్లో సమావేశాలు పెట్టుకుని కష్టాలు పడుతున్నారన్నారు. . గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తామంతా కాలర్ ఎగరేసుకుని పాల్గొంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అన్ని రకాల సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందడం వల్లనే ఆ ధైర్యం తమకు వచ్చిందన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా బురదజల్లే ప్రయత్నం చేసినా, ఎన్ని కుట్రలు పన్నినా, ఎవరితో కలిసి రాజకీయ వ్యభిచారం చేసినా వారి కల నెరవేరదని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని తెలిపారు. మరో 20 ఏళ్లు జగనే సీఎంగా ఉండాలని జనం కోరుకుంటున్నారన్నారు. డిసెంబరు నాటికి 2,60,000 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

నందమూరి వంశమంటేనే చంద్రబాబుకు మంట
– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు నందమూరి వంశమంటేనే విపరీతమైన మంట అని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. నారా లోకేష్ ఏ అర్హతతో పాదయాత్ర చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. 2013లో చంద్రబాబు పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చారన్నారు. హామీలు ఎంతవరకు నెరవేర్చారో ప్రజలకు తెలియజేయాలన్నారు. 600 పైచిలుకు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఉనికి కోసమే లోకేష్ పాదయాత్ర పేరుతో నాటకాలు ఆడుతున్నారన్నారు. అయినా కూడా వారి పార్టీలోనే లోకేష్‌ను బలపరిచేవారు లేరన్నారు. నందమూరి వంశం నుంచి కబ్జా చేసిన టీడీపీలోకి నందమూరి వంశస్తులు వస్తారన్న భయంతోనే పాదయాత్ర నాటకమాడుతున్నారన్నారు. లోకేష్ పాదయాత్రతో వైఎస్సార్‌సీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని టీడీపీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి పాదయాత్రలు, ఇలాంటి నాయకులు ఎంతమంది ఏకమైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని తెలిపారు.

అమరావతి రాజధాని అన్నాడు.. మంగళగిరిలో ఓడిపోయాడు
– ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

లోకేష్ పాదయాత్ర ఏ క్యాడర్‌తో చేస్తున్నాడో ప్రజలకు సమాధానం చెప్పాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రశ్నించారు. తన తండ్రి అధికారంలో ఉన్నప్పుడు అమరావతి రాజధాని అని చెప్పారని, కానీ మంగళగిరిలో పోటీ చేసి ఓడిపోయారని గుర్తు చేశారు. లోకేష్ మంచి నాయకుడైతే అక్కడి ప్రజలు ఎందుకు ఓడించారో సమాధానం చెప్పాలన్నారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు లోకేష్ పాదయాత్ర ఉందన్నారు. నక్క ఎప్పటికీ పులి కాదన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. లోకేష్‌కు ఏ భాష సరిగా రాదన్నారు. వర్ధంతి, జయంతికి తేడా తెలియదన్నారు. ఇలాంటి వ్యక్తులు 40 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినా ఒరిగేది లేదన్నారు.

జీఓకు.. జియోకు తేడా తెలీదు
– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చంద్రబాబు పుత్రరత్నం లోకేష్‌కు జీఓకు, జియోకు తేడా తెలియదని, అలాంటి వ్యక్తి పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన పాదయాత్రలో కేవలం రోప్ పార్టీ, వలంటీర్లు మినహా కేవలం 12-13 మంది కన్నా ఎక్కువమంది జనాలు కనిపించడం లేదన్నారు. కొన్ని పత్రికల వల్ల మనుగడ సాగిస్తున్నారు తప్ప ప్రజల్లో ఆ పార్టీపై, ఆ నాయకులపై ఎలాంటి విశ్వాసం లేదన్నారు. గతంలో కమీషన్లు, లంచాలతో లబ్ధి పొందారని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి కుల,మత, వర్గ, రాజకీయ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

పేలవంగా లోకేష్ పాదయాత్ర

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర పేలవంగా ఉందని, ఇలాంటి పరిస్థితి దేశంలో ఏ నాయకుడికి రాదు, రాబోదని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి ఉన్నప్పుడు మాత్రమే ప్రతిపక్షపార్టీ చేసే పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన ఉంటుందన్నారు. రూ.లక్షా 42వేల కోట్లతో సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న తరుణంలో ఇలాంటి పాదయాత్రలతో నపుంసకునికి వివాహం చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో అలానే ఉంటుందన్నారు. కేవలం కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు మాత్రమే వస్తాయని తెలిపారు. వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేసినప్పుడు సమస్యలు కోకొల్లలుగా ఉండేవన్నారు. ఎలాంటి సమస్యలు లేనప్పుడు చేస్తున్న లోకేష్ పాదయాత్ర 400 రోజులు ఎలా సాగుతుందోనని అందరూ ఎదురు చూస్తున్నారన్నారు. విద్యుత్ వినియోగాన్ని లెక్కించేందుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే వైఎస్ పండుగ చేసి నిరూపించారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అక్కడక్కడ మాత్రమే గ్రామాల్లో పశువైద్య సేవలు అందించే వైద్య నిపుణులు ఉండగా, మూగ జీవాలపై ప్రేమతో జగన్ ప్రతి నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌లను ఏర్పాటు చేసి వైద్య నిపుణులను నియమించారని తెలిపారు.

చంద్రబాబు హయాంలోనే పీఎంఎఫ్ మూత

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో హెరిటేజ్ డైరీని అభివృద్ధి చేసుకునేందుకు ప్రొద్దుటూరు పాలకేంద్రంతోపాటు చిత్తూరు పాలకేంద్రాన్ని మూసివేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. బాబు హైటెక్ సిటీని తప్ప రైతులను, గ్రామాలను పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు.